# వాన వెలిసింది

సరోజినితో నావివాహం నిశ్చయమైంది. పెద్ద వాళ్లు నలుగురూ చేరి ఒకళ్ళ వంశమర్యాదలు ఒకళ్లు కూడబలుక్కుని కట్నం కానుకల విషయంలో ఏ పేచీ పూచీలూ లేకుండా ఖచ్చితంగా తేల్చుకుని నిశ్చయం చేసుకునే బాపతు పెళ్ళి కాదిది. అసలు పెద్దలంటూ ఎవరూ లేకపోబట్టే పొట్టకోసం దేశాంతరాలు ఇలా వచ్చి, నదిలో కొట్టుకునిపోయే రెండు పుల్లల్లా కలుసుకున్నాం నేనూ సరోజినీను. మొదట స్నేహంగా రూపొందిన ఈపరిచయం చివరికిలా పరిణమించబోతోందంటే అందుకు బాధ్యత ఇద్దరిదీ సరిసమానమే అని చెప్పాలి. నా అంతట నే వెళ్ళి ఆమె పాదాక్రాంతుడ్నై నా వ్యక్తిత్వాన్ని ఆమె ముందు తాకట్టుపెట్టి 'నా జీవితాకాశంలో నువ్వు లేకపోతే మబ్బేసినట్టుగా' ఉంటుందంటూ నేనేమీ ప్రణయ కవిత్వం అప్పచెప్పలేదు. అలాగే ఆమె కూడాను. నిండు కుండలా ఏమాత్రం పైకి తొణక్కుండా మసులుకుంది. అయితే ఈ జరగబోయే వివాహం ఎలా నిశ్చయమైందని మీరు ప్రశ్నించొచ్చు. అదంతా ఓ విచిత్రమైన గాథ.

జీవితంలో ఎన్నో కలలు కని, ఏవేవో ఊహించుకుని, అవన్నీ నన్ను మోసం చేసినప్పుడు, ఆకులేని మోడైపోయిన నా జీవితం సరోజిని పరిచయంతో తిరిగి చిగురు తొడిగింది. నా మనసు వికసించినట్టయింది. నాది ప్రేమనండి, కాకపోతే వ్యామోహం అనండి సరోజిని నా వస్తువైపోవాలని మనసులో మహా తహతహలాడిపోయాను; పైకి వ్యక్తిత్వం నిలబెట్టుకుంటూను. కాని తెగించి ఎలా ఆ ప్రస్తావన తీసుకురావాలో చేతకాక వానకురిసి వెలిసిన ఓ సాయంత్రం "మీతో ఓమాట చెప్పాలనివుంది అలా వెళ్దాం వస్తారా?" అని నేననగానే "నేనూ ఓమాట చెబుదామనుకుంటున్నాను. పదండి" అంటూ ఒక అడుగు కిందకి జారిపోయాసా అనుకుని పోయినవ్యక్తిత్వంకోసం బాధపడుతున్న నన్ను మళ్ళీ నిలబెట్టింది. ఇద్దరం అడగదల్చుకున్న దేవిటో కాగితాల మీద రాసుకుని ఒకళ్ళ కాగితం ఒకళ్ళం చదువుకున్నాం. మా ఇద్దరి ముఖాలూ సిగ్గుతో జేవురించాయి. కళ్లు మూతలు పడిపోతున్నాయి. కంటి చివరినించి ఒకళ్లొకళ్లం చూసుకున్నాం. ఇదంతా రెండు నిమిషాల్లో జరిగిపోయింది.

ఫలానారోజు ఫలానా ఇన్ని గంటలకు, ఫలానా ఫలానావారి సమక్షంలో రిజిస్ట్రార్ ఆఫీసులో మా వివాహం జరుపుకుందుకు నిశ్చయించుకున్నాం. పెళ్లిఖర్చు పాతిక, ముప్ఫైకి మించకూడదు. అప్పట్నించి మా ఇద్దరిమధ్య చనువు హరించుకుపోవటం మొదలెట్టింది. పక్కనే కూర్చుని కబుర్లతో కరిగించి కిలకిలా నవ్వి పకపకా నవ్వించే సరోజిని రెండురోజుల కొకమారు కనిపించి, ఆ కాస్తసేపూ మాటి బిడాయించుకుని అడిగితే జవాబుచెప్పి, అడగాలనుకున్న ప్రశ్నలు మనసులోంచి బైట పెట్టలేక ఇలా సతమతమైపోతోంది. ఆమే కాదు నేనుకూడా అలాగే మసులుతున్నానా అనే ఆత్మపరీక్ష చేసుకుంటే నాగురించి కూడా సరోజిని ఇలాగే భావిస్తూండవచ్చు అని తేల్చుకున్నాను.

## పురాణం సూర్యప్రకాశరావు

పెళ్లి!... ఈ రెండక్షరాల ముక్క గతించిపోయిన స్మృతుల నెన్నిటినో మెదడులో గిరగిరా తిప్పేసింది. బుర్ర వేడెక్కిపోయింది. కళ్లు మండాయి. హృదయం బరువెక్కిపోయింది రెండు కన్నీటిచుక్కలు అప్రయత్నంగా నా కంటినించి చెంపల మీదుగా జారటం సరోజిని చూడలేదు. కాని సరోజినికూడా కళ్లు తుడుచుకోవటం నేను గమనించాను. నేను గమనిస్తున్నానని గ్రహించి తత్తరపడుతూ తెచ్చికోలు నవ్వుతో సిగ్గుపడుతూ ముఖం తిప్పేసుకుంది. ముందు కొంత కంగారుపడ్డా అవి ఆనందబాష్పాలని తీర్మానించుకుని నా మనసుకు ఊరట కల్గించాను. మాకు వంశమర్యాదలతో పనిలేదు, కులభేదాలతో పనిలేదు, అసలా ప్రస్తావనే రాలేదు. 'మీ దేకులం?' అని నేనామెను అడగలేదు. ఆమె నన్నూ అడగలేదు. కాని ఒక విషయంమాత్రం నాకు తెలుసు. సరోజిని మాంసాహారి మటుకు కాదు. ఆహార విషయంలో, ఆచారాది విషయాల్లోనూ మా ఇద్దరిమధ్యా వైరుధ్యం లేనప్పుడు ఆమె ఎవరైతేమటుకు నాకు దేనికి? అదే అభిప్రాయం ఆమెకూడా వెలిబుచ్చింది. సరోజినికి ఎంత ఆస్తిఉందో నాకూ అంతే ఉంది. కాకపోతే సంపాదించిన దానిలోనే జాగ్రత్తగా వాడుకుని కొద్దిగా వెనక వేసుకునే లక్షణం సరోజిని దగ్గర ఉందిగాని నాదగ్గిరలేదు. ఆ విషయంలో భార్య అజమాయిషీలో మా సంసారం ఏ ఒడుదుడుకులూ లేకుండా సాగిపోగలదనే ధైర్యం నాకుంది.

సరస్వతిమటుకు సరోజినిలాంటిది కాదు. నా మోస్తరుగా నే ఖర్చుమనిషి. ఆదివారం అందలం సోమవారం జోలి. సరస్వతి తలపుకు రాగానే మనసంతా ఏదో అవ్యక్తంగా కుమిలిపోతుంది. ఏపనీ చెయ్య బుద్ధిపుట్టదు. అమాయకమైన ఆమె నవ్వు నా మనసంతా నిండిపోయి ఏపని తోచనివ్వదు, మరో చెంప సరోజినిని అసలు నిజం కప్పిపెట్టి మోసం చేస్తున్నానా అనే బాధ. రెండు వైపులనించి మనిషిని దహించివేస్తున్నాయి. ఒకదానివెంట మరొకటి చొప్పున ఆలోచనలు తోసుకు రాసాగాయి. నన్ను నేను సమర్థించుకుందుకు పూనుకున్నాను. అవును తప్పేముంది? ఒకభార్య చనిపోతే మరో

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
కండపుష్టికి. వీర్యవృద్ధికి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు-17

## ★ 'వాన వెలిసింది' ★

పెళ్లి చేసుకుంటున్న నాకు ముప్పైఏళ్లేనా నిండలేదే? యౌవ్వనం సడలని నేను పాతిక పై బడ్డ సరోజినికి ఈడూ జోడూ కానూ? అర్థనికేమీ లోటు లేదు. కాకపోతే ఈ రహస్యం ఆమె చెవిని వేసినందువల్ల ఒరిగే దేమిటి? ఆమె మనసు మార్చుకుంటే?— భయంకరమైన ఆలోచన నన్ను వెన్ను చరిచి నట్టుగా లేపి నిలబెట్టింది.

"చీకటిపడింది. వస్తాను సరూ" అంటూ హోటల్ వేపుకి బయల్దేరాను. నాలుగడుగులు వేసి వెనక్కి చూశాను. సరోజిని నావైపు చూస్తూ నిలబడిఉంది. నాకళ్లు చెమ్మగిలాయి. బలవంతాన మనసుని అదుపులోకి తెచ్చుకున్నాను. ఏమైనా సరే ఈరహస్యం బైటపెట్టి సరోజినికి దూరం కావటం నాకిష్టంలేదు. సరోజిని నా వస్తువు. అందుకెవరూ అటంకపర్చలేరు. హోటల్లో భోజనం చేస్తున్నంతసేపూ ఇదే ఆలోచన. అన్నం సయించలేదు. గబగబా ముగించి ఇంటికి వచ్చేశాను. హరికేన్ లాంతరు వెలిగించి టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని చేతికితగిలిన పాతపుస్తకం చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పసాగాను. సరస్వతి తన స్నేహితురాలితో కలిసి తీయించుకున్న ఫొటో నాకంటబడింది. కళ్లుమూసి పెదాలు బిగపట్టి దుఃఖాన్ని అణచుకున్నాను. గడుసుతనం లేని సరస్వతిని అందం చూసి పెళ్లిచేసుకున్నానుగాని ఆస్తిని చూసికాదు. అలాగే చేసుకుని ఉంటే వంశం నిలబెట్టటంకోసం అంటూ ఆమె తండ్రి మరుపెళ్లి చేసుకున్ననాడు కనీసం సరస్వతి దగ్గరైన నసిగేవాణ్ని. అసలా ఉద్దేశమే లేనప్పుడు అలా సంకుచితంగా సంచరించటం ఎలా జరుగుతుంది? సరస్వతిని నేను చాలా గౌరవించాను. ఆనాడు ఆయింట్లో నాకెంత అధికారం ఉందో ఆమెకీ అంతే ఉంది. ఆమె బ్రతికిన నాలుగు సంవత్సరాలూ నాలుగురోజులుగా గడిచిపోయాయి. ఆతర్వాత సరోజిని పరిచయం అయేవరకూ నిమిషం యుగంగా గడిపాను. కృంగిపోయిన హృదయాన్ని సరోజిని పరిచయంతో కుదుటపరుచుకున్నాను. నా సరస్వతి ఈ రూపంలో మళ్లా నాదగ్గరకొచ్చిందా అనిపించింది. అలాగే భావించాను. కాని తొందరపడి మనసు బైటపెడితే ఆమె పెదవి విరిస్తే పర్యవసానం చాలా ఘోరంగా ఉంటుందనే అభిప్రాయంతో బైటికి ఇంతవరకూ తొణకలేదు. ఒక భార్యచనిపోతే మరోపెళ్ళి చేసుకోవటం తప్పా? సరోజిని అభిప్రాయం ఏమై ఉంటుంది? ఆ మాత్రం సంస్కారం ఆమెలో లేకుండా పోతుందా? ఆపాటి సంస్కారమే ఆమెలో లేనిపక్షంలో అటువంటిమనిషిని వివాహం చేసుకుంటే ముందు ముందు నేనెటువంటి సమస్యల్ని ఎదుర్కోవాలో, ఒకవేళ ఎప్పుడైనా ఈరహస్యం బైటపడితే అప్పుడు అటువంటి వ్యక్తితో కాపరం ఎంత అవాంఛనీయంగా పరిణమిస్తుందో నాకు తెలుసు. నేనీరహస్యం మనసులోనే దాచిపెట్టుకుని అతలాకుతలమై పోవాల్సిన అవసరం లేకుండా సరోజిని నాకు మనశ్శాంతి చేకూర్చలేదా? ఆమె కౌగిలింతమీద రాసినట్టుగా నన్నంత గాఢంగా ప్రేమిస్తున్న పక్షంలో ఈపాటి చిన్నవిషయాన్ని క్షమించి తోసిపారెయ్యటం సరోజినికి చేతకాదా?-లక్ష ప్రశ్నలు నాలో ఉద్భవించాయి. అంతే కాదు సరోజిని మనస్తత్వమెలాంటిదో ఈ విషయం మీద తేలిపోవాలని కూడా నిర్ణయించుకున్నాను. ఇలా ఒక నిశ్చయానికి వచ్చింతర్వాతగాని నాకారాత్రి నిద్రపట్టలేదు.

*　　*　　*

ఉదయం. గడియారం పదిగంటలు కొట్టింది. 'ప్రకాశరావుగారూ' అంటూ సరోజినికంఠం వినిపించగానే "నేనూ రెడీగా ఉన్నాను" అంటూ చొక్కా సర్దుకుంటూ ఇవతలికి వచ్చాను. సరోజిని కుర్చీలో కూర్చుని పత్రిక తిరగవేస్తూ నన్ను చూసి తలెత్తి "ఇవాళనించీ నేనూ మీహోటల్లోనే భోజనం చేస్తాను. ఇవ్వాళే టిక్కెట్లు తీసుకుంటాను" అంది. సరోజిని నేనూ పనిచేసేది ఒకటే ఆఫీసులోనైనా భోజనంమటుకు వేరే వేరే హోటళ్ళలో. "నేనే మార్చుకుందాం అనుకుంటున్నాను. ఎలాగైతేనేం! మంచిపని చేశారు," అన్నాను, అద్దంముందు నిల్చుని తలదువ్వుకుంటూను. రాత్రి నిర్ణయం మటుకు నేమర్చిపోలేదు. సమయం కనిపెట్టి అడగాలనే ఆత్రుత నాలో క్షణక్షణం ఎక్కువై పోతోంది

తలుపు తాళంవేసి ఇద్దరం రోడ్డుమీదికొచ్చేశాం. ఎండ ఎర్రగా పాకిపోతోంది. "మా స్నేహితుడొకడు ముప్ఫై ఏళ్లొచ్చిం తర్వాత మొదటి పెళ్లాం చనిపోతే ఇప్పుడు మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడు. రెండో పెళ్లి చేసుకునేవాళ్ళగురించి మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాను ఉన్నట్టుండి. అంటూనే ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాను. ఆమె ముఖం ఎర్రబడి గంభీరంగా ఉండటం గమనించాను. సరోజిని నాకు దగ్గరయేది దూరం అయేదీ ఇప్పుడే తేలిపోవాలి. నాగుండెలు వేగంగా కొట్టుకున్నాయి. పెదాలు వణికాయి. ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. నా ఆత్రుతకి తగ్గట్టే సరోజిని నోరు మెదపటం లేదు. వినిపించుకోనట్టుగా రోడ్డునాన చెట్టుమీద కాకిగూళ్ళకేసి చూస్తోంది. ఆమెకి వినబడలేదు కాబోలు అని మరోమారు ఆ ప్రశ్నే రెట్టించాను. ఆమె ముఖం చిట్లించి విసుగ్గా "పోనిద్దురూ. మధ్య మనకెందుకీ మెదడు ఖరాబు?" అంటూ తేలిగ్గా తోసిపారేసింది. నా మనసులో ప్రశ్న ప్రశ్నలాగానే ఉండిపోయింది. ఆమె అభిప్రాయం మటుకు బైటపడలేదు. సరోజిని ఎందుకు విసుక్కున్నట్టు? నాకంతా అయోమయం అయిపోయింది. ఈ సంఘర్షణ అంతమైపోయి నా మనసు శాంతిస్తుందనే ఆశతోఉన్న నేను మళ్ళీ ఎప్పటిమాదిరి స్థితిలోకి వచ్చిపడ్డాను. చివరికి తెగించి వున్న విషయం చెప్పేద్దామా అనిపించి మనసులో ఉన్నది నాలిక చివరిదాకా వచ్చాక ప్రయత్నించి ఆపుకున్నాను. ఒకవేళ ఆమెకి ఇష్టంలేకపోతే? ఆమె మనసు విరిగిపోదూ? నా హృదయంలో హృదయం సరోజిని నాకు దూరం అయిపోవటం నేను సహించగలనా? అలాగని ఈ రహస్యం దాచిపెట్టి ఆత్మవంచన చేసుకోనా? ఉన్న నిజం గ్రహించి సంస్కార హృదయంతో సరోజిని ఈ చిన్న అపశ్రుతిని పెదవి విరిచి "ఇంతేనా!"


రవి టాయిలెట్స్

అందమునకు,

వర్చస్సుకు




సోల్ ఏజంట్లు:—

ది న్యూ స్టార్ & కో., మద్రాసు 1.



శరత్ సాహిత్యము

40 విడి పుస్తకాలుగానూ ముద్రణగాలిచే బైండ్లుగల 14 సంపుటములుగాను వచ్చాయి. సెట్టు రు. 72-8-0.

ఇంకా ఇతర వివరాలకు

దేశికవితా మండలి, విజయవాడ-2.

...ది, నన్ను ప్రేమించగలిగిన్నాడు మా కాపరం ఆనందంగా ఉంటుందా? కాకపోతే ఆ రహస్యం నేను దాచిపెట్టి ఇప్పుడే నూతనంగా వైవాహిక జీవితం గడుపుతున్నట్టుగా ఆమె భావిస్తూంటే నేను అవునన్నటుగా మనసులో తిరుగుబాటును అణిచిపెట్టి నటిస్తే హాయిగా ఉంటుందా? నా అంతరాత్మ అందుకీ ఒప్పటంలేదు ఇందుకూ ఒప్పటంలేదు. కారణం సరోజిని ఎల్లాంటి మనిషో పూర్తిగా నాకు తెలియకపోవటం. ఎలా చావటం! ఈ సంఘర్షణలో నేను నలిగిపోతూనే సరోజిని కూడా ఎందుకో అదో మాదిరిగా ఉండటం గ్రహించాను. "అదేం సరోజినీ అలా పరాగ్గా ఉంటున్నావు?" అని అడిగాను ఓమారు. "అహాఁ! ఏమీ లేదు! మామూలుగానే ఉన్నాను" అంటూ గొణిగింది.

మరోమారు అదే ప్రశ్న సరోజిని నన్ను వేసింది "అలా ఉంటున్నావేం?" అని.

గతుక్కుమన్నాను. గుండెలు కొట్టుకున్నాయి. "ఏమీలేదు" అంటూ నాన్చేశాను.

తనకి ఒక్క గానొక్క తమ్ముడున్నాడని, వాడంత విద్యాధికుడు కాడని, ఎక్కడ ఎలా ఉంటున్నాడో అంటూ నిట్టూరుస్తూ బాధపడుతూ నాతో చాలా సార్లు చెప్పింది. ఆమె ముఖంలో ఈ మార్పుకి కారణం ఆ తమ్ముడు జ్ఞాపకి రావటం అయిఉంటుందని నేను ఊహించాను. ఆమెను ఓదార్చాను. "తమ్ముడి కోసం బాధపడకు సరూ. మనిద్దరం కలిసి సంపాదిస్తున్నాం. మన సంపాదన ముగ్గురికి చాలకపోతుందా, అతన్నీ ఒచ్చెయ్యమందాం" అంటూ నచ్చచెప్పాను.

ఆమె పేలవంగా నవ్వి ఊరుకుంది.

హోటల్లో భోజనం పూర్తిచేసుకుని ఆఫీసుకి వెళ్లిపోయాం. ఎవరి సీట్లలో వాళ్లు వెళ్ళి కూర్చున్నాం. ఆడ గుమాస్తాలంతా సరోజినిని చుట్టేశారు. నేను నవ్వుతూ వాళ్ల మధ్యనించి సరోజినిని చూస్తుంటే పకపకా నవ్వే తెంగ గొంతుకలు నన్ను చుట్టుముట్టాయి. అంతా ఎవరికి తోచినట్టుగా వాళ్లు వేళాకోళాలు మొదలుపెట్టారు. ఉక్కిరిబిక్కిరైపోయాను. ఇదంతా ఒక్క నిముషం. అధికారి కంఠం వినిపించగానే అంతా కిక్కురుమనకుండా ఎవరి స్థానాల్లోకి వాళ్ళెళ్ళి కూర్చున్నారు.

* * *

రాత్రి మంచంమీద వారబడి ఆలోచించసాగాను. ఎటూ పాలుపోవటంలేదు. హరికేన్ లాంతరు మసక మసకగా వెలుగుతోంది. లేచి టేబిల్ ముందు కూర్చుని కాగితం కలం తీసి సరోజినిపేర ఉత్తరం రాయసాగాను.

"ఒక ముఖ్యవిషయాన్ని నీముందు విప్పి చెబుతున్నాను. ఏమాత్రం ఆవేశానికీ, ఆగ్రహానికీ లోనుకాకుండా నిశితంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రాగలవనీ, ఆ నిర్ణయం నాకెంతో సంతృప్తి కలిగించగలదనీ నమ్ముతున్నాను. ఒక నిజాన్ని నీ ముందు దాచి, నిన్ను మోసంచేసి, నీ ముందు ఘరానాగా సంచరించటం నా ఆత్మకు సమ్మతంకాదు. ఎందుకంటె నాకు కాబోయే భార్య ఎంతో సంస్కారం కలిగిందై ఉంటేనే నాకు చాలా తృప్తిగా ఉంటుంది. ఉన్న నిజాన్ని నీముందు ఉంచుతున్నాను. అదేమీ నువ్వు క్షమించలేని విషయంకాదు. సంస్కార హృదయం ఈ చిన్నవిషయాన్ని పట్టించుకోనట్టే మసులుకోగలదు. నేనైతే అలాగే చేసేవాణ్ని. మీరుకూడా నాతో ఏకీభవించగలరని ఆశిస్తున్నాను. నాకు ఇదివరకే వివాహం అయింది. ఆమె పేరు సరస్వతి. నాలుగు సంవత్సరాలు ఆమెతో కాపరం చేశాను. ఆ తర్వాత ఆమె చనిపోయింది. పిల్లలు లేరు. నీ జవాబుకోసం ఎదురుచూస్తూంటాను."—ఇలా రాశాను ఉత్తరం. నా మనస్సు తేలికపడింది. ఈ ఉత్తరం మొర్నాడే పోస్టు చెయ్యటానికి గట్టిగా నిశ్చయించుకున్నాను.

* * *

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. బద్ధకంగా లేచి కళ్లు నులుపుకుంటూ తలుపు తీసుకుని మధ్యగదిలోకి వచ్చాను. బ్రష్ పేస్టూ తీసుకుని వీధి అరుగుమీదికి నడిచాను. దూరంగా చేతి సంచీతో సరోజిని ఇటువైపే రావటం గమనించాను.

నేను ముఖం కడుక్కుంటూంటే సరోజిని వచ్చింది. "అలా లోపలికి వెళ్ళి కూర్చో." అన్నట్టుగా సౌజ్ఞచేశాను. ఆమె లోపలికి వెళ్ళిపోయింది. సరోజిని కంటిముందు కనిపిస్తే మునుపటిలా మనసు ఆనందంతో ఉరకలు వెయ్యటం లా. గుండెలు గబగబా కొట్టుకుంటున్నాయి. చేజేతులా కొలంపటంలో ఎందుకు దిగబడ్డానా అనిపిస్తోంది.

నేను లోపలికి వచ్చేసరికి సరోజిని కిటికీ వారగా నిలబడి ఆకాశంలోకి చూస్తోంది. ముఖం తుడుచుకుని ఆమె వెనకాతలే వెళ్ళి నిలబడ్డాను. చల్లటిగాలి తెరలు తెరలుగా వీస్తుంటే ఆమె ముంగురులు మెల్లగా అటూ ఇటూ కదులుతున్నాయి.

"సరోజినీ!"

సరోజిని ఉలకలేదు. పలకలేదు. కనీసం ముఖమైనా ఎత్తలేదు.

మళ్లీ పిలిచాను.

ఈమారు సరోజిని ముఖం నావైపు తిప్పింది.

ఆకళ్లలో కాంతిలేదు. ముఖం బరువుగా కనిపించింది. "అదేం అలాగున్నావ్?" అన్నాను ఆత్రుతగా.

"మిమ్మల్ని ఒకటడుగుతాను. సూటిగా జవాబు చెబుతారా?" అంది సరోజిని.

"ఏమిటది? అడుగు"

"ఒకభర్త చనిపోతే ఆడది మరో పెళ్లి చేసుకోవటం గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అంది సరోజిని.

"ఏం అలాగడుగుతున్నావు?"

"నాకిదివరకే వివాహం అయింది. నాలుగు సంవత్సరాలు కాపరం చేశాం. తర్వాత ఆయనపోయారు. పిల్లలులేరు. నన్ను పెళ్లిచేసుకోవటం ఇప్పుడు మీకిష్టమేనా?"—ఆమె ఆత్రుతగా నా ముఖంలోకి చూసింది, ఈమాటలని.

క్షణం నివ్వెరపోయాను. మరుక్షణం నామనసంతా ఉల్లాసంతో గంతులు వేసింది. మా ఇద్దరిలోనూ ఎవరూ ఎవరివిషయంలోనూ ఔదార్యం చూపించాల్సిన అవసరంలేదు. అసలు సమస్యేలేదు. ఇన్నాళ్లూ జరుగుతున్న సంఘర్షణ ఆ నిముషంలో చప్పగా చల్లారిపోయింది. ఆనందాతిశయంతో ఆమెను హృదయానికి హత్తుకుని "నువ్వు నాదానివిసరూ" అన్నాను. ఆమె ముఖం వికసించింది. సిగ్గుతో కుంచించుకపోయింది. నాలో స్వార్థం కొంత దాక్కుని ఉంది కాబోలు క్షణం నారహస్యం బైట పెట్టటానికి వెనకాడాను. ఈవిషయం బైటపెట్టాల్సిన అవసరం లేదు నిజానికి. కాని నన్ను గురించి ఆమె ఎలా భావిస్తూంటుంది? ఈ రహస్యం బైటపెట్టటంవల్ల వచ్చేనష్టమేమీ లేనప్పుడు ఆత్మవంచన చేసుకోవటమెందుకు? తనకంటె నేనెంతో ఉత్కృష్టమైన వ్యక్తిననీ, కాబట్టే జీవితంలో మొదటిసారిగా వివాహం చేసుకుంటూనే వితంతువుని సుమంగళిని చేశాననీ ఆమె అపోహపడి, జీవితపర్యంతం నాకు కృతజ్ఞురాలుగా ఉండటం నా ఆత్మకి సమ్మతం కాలేదు. అందుకనే మనసు విప్పి రహస్యం బైటపెట్టేశాను.

సరోజిని క్షణం నివ్వెరపోయినట్టుగా చూసి, లిప్తలో ముఖంఅంతా వికసింప చేసుకుని, గుండెలమీద బరువంతా తీరిపోయేట్టుగా నిట్టూర్చి, "మనిద్దర్నీ దేవుడు విచిత్రంగా జతపర్చాడు" అంది.

ఇప్పుడు ఇన్నాళ్లికి నామనసు పూర్తిగా కుదుటపడింది. గాలివాన కురిసి వెలిసినప్పటి ప్రశాంతత నాహృదయాన్ని ఆవరించింది. అనవసరంగా తిన్నతాను తక్కువచేసుకుంటే ఎదుటివాడు తనకంటె ఉన్నతమైన వ్యక్తిగా భావించాల్సిన అవసరం లేకుండా ఆమెను సమానమైన అంతస్తులో నిలబెట్టగలిగాననే సంతృప్తితో ఆమె ముఖంలోకి చూశాను. అంతివరకూ నావైపు చూస్తున్న సరోజిని తన దృష్టిని కిటికీవైపుకి తిప్పుకుంది. ★